కొత్త కమిటీ ఎప్పుడో?



- ఏనుమాముల మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియమించేనా..
- పాలకవర్గం పదవి ముగిసి నాలుగు నెలలు..
- ఎన్నికల నేపథ్యంలో కొత్త కమిటీని వేయని గత ప్రభుత్వం
- కొత్త ప్రభుత్వంపై ఆశలు
- మార్కెట్ కమిటీ రిజర్వేషన్‌పై అనుమానాలు
- గాడ్ ఫాదర్ల చుట్టూ ఆశావహుల చక్కర్లు

వరంగల్‌టౌన్, జనవరి 5: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం పదవీకాలం ముగిసిపోయి నాలుగు నెలలకు పైగా అవుతున్నా ఇప్పటి వరకు కొత్త పాలక వర్గాన్ని నియమించ లేదు. సెప్టెంబరులో పాలకవర్గం గడువు ముగియగా, తర్వాత కొత్త పాలకవర్గాన్ని నియమించాల్సిన అవసరం ఉన్నా, గత ప్రభుత్వం శాసనసభ ఎన్నికల దృశ్యా ఈ విషయాన్ని పక్కన పెట్టింది. రాష్ట్రంలో ఉన్న అతి పెద్ద వ్యవసాయ మార్కెట్లలో ఏనుమాముల ఒకటి. మార్కెట్లో రోజూ కోట్లాది రూపాయల క్రయవిక్రయాలు, లావాదేవీలు జరుగుతాయి. ఇటీవలే కొలువుదీరిన కొత్త ప్రభుత్వం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీపై దృష్టి సారించి, నూతన పాలకవర్గాన్ని నియమించాలని రైతులు, కార్మికులు, వ్యాపార వర్గాలు కోరుతున్నాయి.

రిజర్వేషన్లు కొనసాగేనా..

మార్కెట్ కమిటీల పదవీకాలం 2014కు ముందున్న కాంగ్రెస్ హయాంలో రెండేళ్లు ఉండగా, తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటయ్యాక కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన పాలకవర్గాలే కొనసాగాయి. కేసీఆర్ ప్రభుత్వం కొత్తగా మార్కెట్ కమిటీల పదవీ కాలాన్ని సంవత్సరానికి కుదించడంతో పాటు మార్కెట్ కమిటీ పాలకవర్గాల నియామకాలలో రిజర్వేషన్లను అమలు చేయాలని కొత్తగా చట్ట సవరణ చేసింది. ఆ తర్వాత పదవీ కాలాన్ని మళ్లీ రెండేళ్లకు పెంచింది. ఓసీ, బీసీ, జనరల్, ఎస్సీ, ఎస్టీ, మహిళా వర్గాలకు రిజర్వేషన్లను కల్పించింది. ఈ మేరకు బీసీ మార్కెట్ చైర్మన్‌గా కొంపల్లి ధర్మరాజు, చింతం సదానందం, బీసీ మహిళ చైర్‌పర్సన్‌గా దిడ్డి భాగ్యలక్ష్మి పదవులు నిర్వహించారు. ఆ తర్వాత ఎస్సీకి అవకాశం ఉన్నట్లుగా మార్కెటింగ్ శాఖాధికారులు చెపుతున్నారు. అయితే ఇప్పుడు ప్రభుత్వం మారింది. పాత ప్రభు త్వం అమలు చేసిన రిజర్వేషన్లను కొత్త ప్రభు త్వం అమలు చేస్తుందా..? లేక రద్దు చేస్తుందా...? అన్నది ఉత్కంఠగా మారింది.



తెరపైకి ఆశావహుల పేర్లు..

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పలువురు ఆశావహుల పేర్లు వినిపిస్తున్నాయి. వీరిలో మాజీ మేయర్ గుం డా ప్రకాష్‌రావు, గోపాల నవీన్‌రాజ్, నల్గొండ రమేష్, నమిండ్ల శ్రీనివాస్, కటకం పెంటయ్య, మీసాల ప్రకాష్, కంకల సదానందం, కొత్తపల్లి శ్రీనివాస్‌ల పేర్లు వినబడుతున్నాయి.

నాలుగు నియోజకవర్గాల పరిధిలో..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యంత ప్రాధాన్యత కలిగిన నామినేటెడ్ పోస్టులలో ఏనుమాముల మార్కెట్ కమిటీ చైర్మన్, 'కుడా' చైర్మన్ పదవులు. కుడా, ఏనుమాముల మార్కెట్ కోట్లాది రూపాయల లావాదేవీలతో కూడుకుని ఉన్నవి. మరోపక్క నాలుగు, ఐదు నియోజకవర్గాల పరిధిలో ఉంటుంది. మంచి ప్రోటాకాల్ ఉంటుంది. అందుకే వీటికి డిమాండ్ ఎక్కువ.

కొండా దంపతుల చుట్టూ ప్రదక్షిణ

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం ఆశావహులు మంత్రి కొండా సురేఖ మురళీధర్‌రావుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత ప్రభుత్వం పెట్టిన నిబంధనలను కొత్త ప్రభుత్వం తొలగిస్తుందని భావిస్తున్నారు. 2014కు ముందున్న గత కాంగ్రెస్ ప్రభుత్వం ఏ విధంగా ఉందో అదే విధానాన్ని మళ్లీ తీసుకువస్తుందని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. పలువురు పార్టీలో తమ గాడ్ ఫాదర్ల చుట్టూ తిరుగుతున్నారు.



ఏఆర్ కిష్టయ్యను విచారిస్తున్న ఏసీబీ అధికారులు

కేయూలో కలకలం

- ఏసీబీ వలలో ఆడిట్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్య
- పాల బిల్లులు మంజూరు చేసేందుకు లంచం డిమాండ్
- విసిగి వేసారి ఏసీబీని ఆశ్రయించిన కాంట్రాక్టర్
- రూ.50వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత



ఏసీబీకి పట్టుబడిన ఏఆర్ కిష్టయ్య

హనుమకొండ క్రైం/ కేయూ క్యాంపస్, జనవరి 5: కాకతీయ యూనివర్సిటీలోని ఆడిట్ విభాగంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సిగసారపు కిష్టయ్య ఓ పాల కాంట్రాక్టర్ నుంచి రూ.50వేల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు అడ్డంగా దొరికిపోయాడు. శుక్రవారం మధ్యాహ్నం 12గంటలకు క్యాంపస్‌లో పెండెం రాజేందర్ అనే వ్యక్తి నుంచి లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం..

వరంగల్ కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన పెండెం రాజేందర్ 15 ఏళ్లుగా కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని మహిళలు, పురుషుల హాస్టళ్లకు పాలు, పెరుగు సరఫరా చేస్తున్నాడు. ఇందుకు ప్రతీ నెల కేయూ ఆడిట్ విభాగం నుంచి డబ్బులను తీసుకుంటాడు. ఈ క్రమంలో రెండేళ్లకు గానూ రూ.15లక్షల బిల్లులు రావాల్సి ఉంది. దీని కోసం రాజేందర్ పలుమార్లు అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్యను కలిసి తనకు రావాల్సిన బిల్లులు ఇవ్వాలని కోరారు. అయితే బిల్లులు మంజూరు చేయాలంటే రూ.75వేలు లంచం ఇవ్వాలని కిష్టయ్య డిమాండ్ చేశాడు. దీంతో చేసేదేమీలేక రాజేందర్ ఒకసారి రూ.15వేలు, మరోసారి రూ.10వేలు ఆన్‌లైన్‌లో పంపించాడు. రెండు విడతల్లో రూ.25 వేలు ఇస్తానని, తర్వాత రూ.50వేలు ఇస్తానని ఒప్పుకున్నాడు. ఇద్దరి ఒప్పందం ప్రకారం గత నెల రెండుసార్లు ఆన్‌లైన్‌లో రూ.25వేలు పంపించగా రూ.8 లక్షల చెక్కును అప్పగించాడు. మిగతా రూ.7లక్షలకు రూ.50వేలు ముందుగానే ఇవ్వాలని ఒత్తిడి తెచ్చాడు.

ఈ క్రమంలో రాజేందర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సలహా మేరకు రూ.50వేలతో శుక్రవారం వ్సటీ క్యాంపస్‌కు వెళ్లాడు. పరిపాలన విభాగం ఆడిట్ కార్యాలయంలో ముందే నిర్దేశించిన ప్లాన్ ప్రకారం తాను తెచ్చిన రూ.50వేల డబ్బును కిష్టయ్యకు అందించాడు. ఇదే సమయంలో అక్కడే మాటువేసి ఉన్న అవినీతి నిరోధక శాఖ అధికారులు మూకుమ్మడిగా దాడిచేశారు. నగదును స్వాధీనం చేసుకుని అప్పటికే తెచ్చిన రసాయనాలలో పరీక్షించారు. అనంతరం కిష్టయ్యను హైదరాబాద్‌లోని ఏసీబీ కార్యాలయానికి తరలించారు. విచారణ తర్వాత ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ సాంబయ్య తెలిపారు. ఈ దాడులలో అవినీతి నిరోధక శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు శ్యాంసుందర్, కె.శ్రీనివాస్, నీలం రవితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

10 శాతం ఇస్తేనే బిల్లు చేస్తానన్నాడు..

- బాధితుడు రాజేందర్



పాలు, పెరుగు సరఫరా బిల్లుల కోసం కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరిగాను. రూ.15లక్షల బిల్లులు చేయాలని అడిగితే 10 శాతం కావాలని కిష్టయ్య డిమాండ్ చేశాడు. బతిమిలాడితే రూ.75వేలకు ఒప్పుకున్నాడు. ముందుగా రూ.25వేలు ఇచ్చాను. కొంత బిల్లు చేశాడు. మిగతా డబ్బుల కోసం తీవ్ర ఇబ్బందులకు గురి చేశాడు. ఎంత బతిమలాడినా కనికరించకుండా డబ్బులు డిమాండ్ చేశాడు. దిక్కుతోచని స్థితిలోనే ఏసీబీని ఆశ్రయించాను.

లైసెన్స్ కలిగిన దడ్వాయిల
చార్జీలు పెంపు

- జిల్లా స్థాయి కమిటీ ద్వారా నిర్ణయం : కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, జనవరి 5 : వరంగల్ మార్కెట్ కమిటీలో పని చేస్తున్న లైసెన్స్ కలిగి ఉన్న దడ్వాయిల చార్జీల పెంపుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వరంగల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీలు లైసెన్స్ కలిగి ఉండి పనిచేస్తున్న దడ్వాయిల మార్కెట్ చార్జీల పెంపుపై 396 జీవో ప్రకారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ దడ్వాయిల చార్జీల పెంపుపై ప్రణాళికలు సిద్ధం చేయాలని కమిటీ ఆమోదం మేరకు నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా మార్కెట్ కమిటీ అధికారి ప్రకాష్‌రావు, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి కె.చందన్‌కుమార్, డీఆర్‌డీవో పీడీ సంపత్‌రావు, సివిల్ సప్లై మేనేజర్ సంధ్యారాణి, మార్కెట్ కమిటీ కార్యదర్శులు, రైతు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆన్‌లైన్ శిక్షణపై సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

దరఖాస్తుల కంప్యూటరీకరణ
పకడ్బందీగా చేయాలి

- కలెక్టర్ పి.ప్రావీణ్య
- 'అభయహస్తం' ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమం పరిశీలన

వరంగల్ కలెక్టరేట్, జనవరి 5: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయ హస్తం గ్యారెంటీల పథకాల దరఖాస్తులను కంప్యూటరీకరణ పకడ్బందీగా చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని ఎంపీడీవో కార్యాలయాల డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మీ సేవ కేంద్రాల డేటా ఎంట్రీ ఆపరేటర్లకు గ్యారెంటీల పథకాలపై జరిగిన ఆన్‌లైన్ డేటా ఎంట్రీ శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. అభయ హస్తం ఐదు గ్యారెంటీల ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలు అందించిన దరఖాస్తులను ఆన్‌లైన్ డేటా ఎంట్రీ చేయుటకు జిల్లాలోని మండలాల ఎంపీడీవో కార్యాలయం, మీ సేవ కేంద్రాల డేటా ఎంట్రీ ఆపరేటర్లను మూడు సెక్షన్లుగా విభజించి జిల్లా పరిషత్, డీఆర్‌డీవో, కలెక్టరేట్ కార్యాలయాల్లో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజలు సమర్పించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఆపరేటర్లకు లాగిన్ పాస్‌వర్డ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఫిజికల్ ఫాంకి ఆన్‌లైన్ డేటాకు తేడా వస్తే తప్పని సరిగా డేటా ఎంట్రీ ఆపరేటర్ బాధ్యత వహించాలని కలెక్టర్ హెచ్చరించారు. ఆధార్‌కార్డు, రేషన్ కార్డు నంబర్లు నమోదు చేసినప్పుడు సరి చూసుకోవాలన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు పంచాయతీ సెక్రెటరి, బిల్ కలెక్టర్లు సహకరిస్తారన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేయు ప్రక్రియను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ముఖ్యప్రణాళికా ధికారి జీవరత్నం, జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధికారి కటకం కల్పన, పశు సంవర్ధక శాఖ జేడీ బాలకృష్ణ పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందిస్తాం..

- ఆరు గ్యారెంటీలను ఖచ్చితంగా అమలు చేస్తాం
- అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- నగరంలో ప్రజా పాలన దరఖాస్తు కేంద్రం పరిశీలన



ప్రజాపాలన అభయహస్తం ఆరు గ్యారంటీల దరఖాస్తులు స్వీకరిస్తున్న మంత్రి కొండా సురేఖ

పోచమ్మమైదాన్, జనవరి 5: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ, కాంగ్రెస్ ప్రభుత్వం తప్పనిసరిగా నెరవేరుస్తుందని, అర్హులందరికీ ఆరు గ్యారంటీ పథకాలను అందిస్తామని అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ నగరంలోని 12వ డివిజన్ దేశాయిపేట షాదీఖానాలో ప్రజా పాలన అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని మంత్రి సందర్శించారు. అధికారులు, ప్రభుత్వ సిబ్బంది పనితీరును పరిశీలించి, ప్రజల నుంచి అప్లికేషన్లు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారంటీల కోసం అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. తొమ్మిదేళ్ల కేసీఆర్ కుటుంబం ప్రజల సొమ్మును దోచుకుందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఏ ఒక్కరికి బీఆర్ఎస్ ప్రభుత్వం న్యాయం చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నెల రోజులు కాకముందే మాపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మీసాల ప్రకాష్, కంకల సదానందం, బాసాని కరుణాకర్‌నేత, గిన్నారం రాజు తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని 19వ డివిజన్ వీవర్స్‌కాలనీ కమ్యూనిటీహాల్‌లో జరుగుతున్న ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని మంత్రి కొండా సురేఖ సందర్శించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మీసాల ప్రకాష్, దాసరి రాజేష్, భూక్యా మోతిలాల్‌నాయక్, సిలివేరు శ్రీనివాస్, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

దేశాయిపేటలోని బొడ్రాయిని మంత్రి కొండా సురేఖ సందర్శించారు. బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నియోజకవర్గంలోని పలు ప్రాంతాలను సందర్శించేందుకు వెళ్లారు.

సంగెం మండలం మొండ్రాయి గ్రామానికి చెందిన వీరగోని సుమలత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఆర్థిక స్తోమత లేకపోవడంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు మంత్రి సురేఖ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2.50 లక్షలు మంజూరు చేపించారు. శుక్రవారం దేశాయిపేటలో సుమలత భర్త మురళికి చెక్కు అందజేశారు.

వరంగల్ కలెక్టరేట్: అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుక్రవారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పర్యటించారు. 12వ డివిజన్ దేశాయిపేటలోని షాదీఖానాలో, 19వ డివిజన్ కాశిబుగ్గ వీవర్స్ సెక్షన్స్ కాలనీలో, 36వ డివిజన్ చింతల్‌లోని జమాతే ఇస్లామీ హిందూ భవన్‌లో, 34వ డివిజన్ శివనగర్ భూపేష్ నగర్ లలో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను పరిశీలించి, ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా పాలన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, నియో జకవర్గంలో 90శాతం దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజావాణి కార్యక్రమం ద్వారా స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రగతి భవన్‌లో ప్రజల నుంచి సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తున్నారన్నారు.

'ప్రజా పాలన'లో గొడవ

- కాంగ్రెస్ నేత ప్రసంగాన్ని అడ్డుకున్న బీఆర్ఎస్ కార్పొరేటర్ భర్త
- ప్రోటోకాల్ పాటించలేదని సభకు ఆటంకం
- బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య తోపులాట
- పోలీసుల చొరవతో సద్దుమణిగిన వివాదం
- తూర్పుకోటలో ఘటన



కానిస్టేబుల్‌తో సురేష్ వాగ్వాదం

ఖిలావరంగల్, జనవరి 5: ఖిలావరంగల్ తూర్పుకోటలో బీఆర్ఎస్ కార్పొరేటర్ వెల్పుగొండ సువర్ణ భర్త బోగి సురేష్ వీరంగంతో శుక్రవారం ప్రజాపాలన సభలో గొడవ జరిగింది. 37వ డివిజన్ తూర్పుకోటలో చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో బీఆర్ఎస్ కాంగ్రెస్ నాయకుల మధ్య తోపులాట జరిగింది. మిల్స్‌కాలనీ పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రజాపాలన దరఖాస్తులను ప్రజల నుంచి తీసుకుంటుందన్నారు. తూర్పుకోటలోని పోచమ్మ దేవాలయం వద్ద జరుగుతున్న సమీక్ష సమావేశానికి కార్పొరేటర్ వెల్పుగొండ సువర్ణ, నగరపాలక సంస్థ అధికారులు వచ్చి సభను ప్రారంభించారు. సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడగా, తర్వాత అధికారులు, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు దూడయ్య ప్రసంగించారు. చివరగా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బెడిద వీరన్న ప్రసంగించే సమయంలో కార్పొరేటర్ భర్త బోగి సురేష్ సభ వద్దకు వచ్చి 'వీరన్నా.. నీకు మాట్లాడే అర్హత లేదు. మీకు ప్రొటోకాల్ తెలుసా..'అంటూ ప్రశ్నించారు. అందుకు వీరన్న మాట్లాడుతూ ప్రొటోకాల్ ప్రకారమే కార్పొరేటర్ వెల్పుగొండ సువర్ణతో ముందుగా మాట్లాడించామని, తాను కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిని, ఖిలావరంగల్ ప్రాంత వాసిగా తాను మాట్లాడుతానన్నారు. దీంతో ఆయన మాట్లాడకుండా సభను అడ్డుకోవడంతో కాంగ్రెస్ నాయకులు కార్పొరేటర్ భర్త, బీఆర్ఎస్ నాయకుడు బోగి సురేష్‌ను అడ్డుకున్నారన్నారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. గొడవ పెద్దది కావడంతో అక్కడే విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ కార్పొరేటర్ భర్త బోగి సురేష్, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులను అక్కడి నుంచి బయటికి పంపించారు. అనంతరం సభను అధికారులు ముగించారన్నారు. ప్రజాపాలన దరఖాస్తులను అధికారులు ప్రజలనుంచి తీసుకున్నారు.

నేటితో 'ప్రజా పాలన'
దరఖాస్తుల ముగింపు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 5: రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజా పాలన అభయ హస్తం ఐదు గ్యారెంటీల పథకాల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని పిలుపు నిచ్చిన నేపథ్యంలో గత నెల 28 నుంచి ఈ నెల 6 వరకు చేపట్టిన ప్రజా పాలన దరఖాస్తుల గడువు నేటితో ముగియనుంది. జిల్లాలో 323 గ్రామ పంచాయతీలు, గ్రేటర్ మునిసిపల్ డివిజన్లు 32, వర్ధన్నపేట మునిసిపాలిటీలలోని 12 వార్డుల్లో, నర్సంపేటలోని మునిసిపాలిటీలలోని 24 వార్డుల్లో శనివారంతో ప్రజా పాలన కార్యక్రమం ముగుస్తుంది. చివరి అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

రోడ్లు, పార్కింగ్ స్థలాల పనులు త్వరగా పూర్తి చేయాలి

- అధికారులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశం
- మేడారం జాతర ఏర్పాట్ల పరిశీలన

మేడారం, జనవరి 5: మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర కోసం చేపట్టిన రోడ్లు, పార్కింగ్ స్థలాల పనులను ఫిబ్రవరి 1వ తేదీ లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. శుక్రవారం తాడ్వాయి మండలంలోని మేడారం పరిసరాల్లో కొనసాగుతున్న పనులను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. పస్రా-మేడారం, మేడారం-భూపాలపల్లి, తాడ్వాయి-మేడారం రూట్లలో చేపట్టిన రోడ్ల మరమ్మతులను స్వయంగా పరిశీలించారు. ఆయా చోట్ల ఏర్పాటు చేస్తున్న పార్కింగ్ ప్రదేశాలు, చిలుకలగుట్ట, జంపన్నవాగు ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న పార్కింగ్ ప్రదేశాలను కలెక్టర్ పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. జంపన్న వాగుపై ఊరట్టం వద్ద నిర్మిస్తున్న కాజ్‌వే పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. మేడారం, ఊరట్టంలోని గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో జాతర విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి వసతి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్, ఏపీవో వసంతరావు, ఈఈ ప్రేమలత, పీఆర్ ఈఈ అజయ్‌కుమార్, ఆయా ఇంజనీరింగ్ శాఖల డీఈలు రఘువీర్, చందర్, రవీందర్, స్టాటిస్టిక్ అధికారి రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

తండ్రిని రాయితో కొట్టి చంపిన కొడుకు


మృతిచెందిన కందళం లింగాచారి

గూడూరు(మహబూబాబాద్ జిల్లా), జనవరి 5 : ఆస్తి తగదాల విషయంలో తండ్రిని కుమారుడు రాయితో కొట్టి చంపిన ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం తీగలవేణిలో శుక్రవారం చోటు చేసుకుంది. గూడూరు ఎస్సై రాణాప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం.. తీగలవేణి గ్రామానికి చెందిన కందళం దేవేంద్రమ్మ-లింగాచారి (70) దంపతులకు బ్రహ్మచారి, కృష్ణ, రమేష్ సంతానం. లింగాచారికి ఆరెకరాల వ్యవసాయ భూమి ఉంది. ముగ్గురు కుమారులకు సమానంగా ఆ భూమిని పంచి, ఇచ్చాడు. లింగాచారిలో వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో అర్చకుడిగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. చిన్నకుమారుడు రమేష్ ఏం పనిచేయకుండా మద్యానికి బానిసై తండ్రి, సోదరులతో తరుచూ గొడవ పడుతుండేవాడు. మద్యం సేవించి వచ్చిన రమేష్ మద్యం మత్తులో లింగాచారి నిద్రిస్తుండగా రాయితో కొట్టి, చంపాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు బ్రహ్మచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాణాప్రతాప్ తెలిపారు.

నేడు, రేపు బ్రహ్మకుమారిల స్వర్ణోత్సవాలు

సుబేదారి, జనవరి 5: వరంగల్ కేంద్రంగా ఆధ్యాత్మిక సేవలు ప్రారంభించి 50 ఏళ్ల పూర్తిచేసుకున్న సందర్భంగా శని, ఆదివారం రెండు రోజుల పాటు బ్రహ్మకుమారీల ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో హనుమకొండ హంటర్‌రోడ్డులోని డి-కన్వెన్షన్ హాల్‌లో స్వర్ణోత్సవాలు నిర్వహించనున్నట్లు బ్రహ్మకుమారి శ్రీదేవి తెలిపారు. డి-కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీదేవి మాట్లాడుతూ.. ఈ స్వర్ణోత్సవాలకు ముఖ్య అతిథిగా మంత్రులు కొండా సురేఖ, సీతక్కలు హాజరవుతారని అలాగే ఉమ్మడి జిల్లాలో ఉన్న 12 నియోజకవర్గ ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు. శనివారం ఉదయం అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో ఒక కొత్త ఆరంభానికి సాకారాత్మక పరివర్తన అంశంపై ఆధ్యాత్మిక కార్యక్రమం, సాయంత్రం 4:30 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజుతో ఆరోగ్య ప్రసంగం, సామూహిక రాజయోగ ధ్యానం అనంతరం బహిరంగ సభ ఉంటుందన్నారు. 7వ తేదీ ఉదయం 6:30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర నుంచి వచ్చే సుమారు 4 వేల మంది బ్రహ్మకుమారీల సభ్యులతో ఆధ్యాత్మిక సమావేశం, సేవలు అందించిన వారికి సత్కారాలు ఉంటాయని తెలిపారు.

పాలిటెక్నిక్ రెండో సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సుబేదారి, జనవరి 5: ఐటీఐలో రెండేళ్ల వ్యవధిగల కోర్సుల్లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పాలిటెక్నిక్‌లో రెండో సంవత్సరంలో ప్రవేశం కోసం బ్రిడ్జి కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ ప్రభుత్వ ఐటీఐ(బాలుర) ప్రిన్సిపాల్ ఎల్.జుమ్లానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జుమ్లా నాయక్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

బీకామ్ విద్యార్థులకు 3 మార్కులు

కేయూ క్యాంపస్, జనవరి 5: కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ బీకామ్ మూడో ఏడాది ఐదో సెమిస్టర్ ప్రశ్నపత్రం ఈ-కామర్స్ సబ్జెక్టులో ఒకే ప్రశ్న రెండుదఫాలుగా వచ్చిన అంశాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలికితీసిన నేపథ్యంలో వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు స్పందించారు. డిగ్రీ ఈ- కామర్స్ పరీక్షలకు హాజరైన విద్యార్థులందరికీ తప్పుడు ప్రశ్నకు అదనంగా 3 మార్కులను కేటాయిస్తామని ప్రకటించారు. జరిగిన తప్పిదంపై సంబంధిత అధికారులపై చర్యలుంటాయని తెలిపారు.

గురుకులంలో ప్రవేశ పరీక్ష

హనుమకొండ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : దేవన్న పేట ప్రభుత్వ గురుకులంలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను 5వ తరగతి (ఇంగ్లీష్ మీడియం) ప్రవేశాలకు ఫిబ్రవరి 11న ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వ హించనున్నట్లు టీటీడబ్ల్యుయూఆర్‌జెసీ (బాలిక లు) హనుమకొండ ప్రిన్సిపాల్ ఆర్.విమల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈవిద్యా సంవత్సరంలో (2023-24) 4వ తరగతి చదువుతున్న అర్హులైన వారు ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ (ఆర్ఎస్) కింద ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో ఈనెల 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అంతా ఆయనే..

హాస్టల్స్ బిల్లుల చెల్లింపుల్లో ఎ.ఆర్. కిష్టయ్యపై పలు ఆరోపణలు

ఏసీబీ ట్రాప్‌తో బెంబేలెత్తుతున్న కేయూ ఉద్యోగులు

గతంలో పరీక్షల విభాగంపై పోలీసుల విచారణ



కేయూ క్యాంపస్, జనవరి 5: కాకతీయ యూనివర్సిటీలో ఏసీబీ దాడులతో అవినీతి ఉద్యోగుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. వర్సిటీ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో శుక్రవారం అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎస్.కిష్టయ్య పట్టుకోవడంతో వర్సిటీలో కలకలం రేగింది. గతంలో పరీక్షల విభాగంలో సర్టిఫికెట్ల జారీలో అక్రమాలు జరిగాయనే ఫిర్యాదులు పెద్ద ఎత్తున రాష్ట్ర ప్రభుత్వానికి అందాయి. దీంతో అప్పటి కాజీపేట ఏసీపీ కోయ ప్రవీణ్‌కుమార్ ప్రత్యేక విచారణ అధికారిగా నియమించి సర్టిఫికెట్ల జారీ, పరీక్షల విభాగంలో చోటు చేసుకున్న అక్రమాల దందాలను బయటికి తీశారు. తర్వాత అప్పటి పరీక్షల నియంత్రణాధికారులపై కేసులు నమోదు చేసిన విచారణ చేపట్టారు. అయితే అప్పటి కేసు అతీగతి లేకుండా పక్కన పెట్టారు. ఇదిలా ఉండగా, వర్సిటీలో తాజాగా పి.రాజేందర్ అనే పాలు, పెరుగు కాంట్రాక్టర్ ఫిర్యాదుతో ఏసీబీ పోలీసులు వలపన్ని కిష్టయ్యను పట్టుకున్నారు.

ఆది నుంచి వివాదాస్పదుడే..

ఏఆర్ కిష్టయ్య ఆది నుంచి వివాదాస్పదుడనే ఆరోపణలున్నాయి. సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాలలో ఎక్కువ కాలం అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించారు. అక్కడ పలు అక్రమాలకు పాల్పడ్డారనే ఫిర్యాదులు రావడంతో వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఆదేశాల మేరకు అప్పటి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.వెంకట్రామిరెడ్డి ఇద్దరు అసిస్టెంట్ రిజిస్ట్రార్లతో విచారణ కమిటీని నియమించారు. అయితే విచారణ కమిటీ ఇప్పటి వరకు రిపోర్టు ఇవ్వలేదు.

అవినీతి ఆరోపణలపై కమిటీ విచారణను ఎదుర్కొంటున్న కిష్టయ్యను వర్సిటీలోని కీలకమైన పదవిలో నియమించి అవినీతికి ఊతం ఇచ్చారనే చర్చలు జరుగుగుతున్నాయి. ఈయన హాస్టల్స్ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా, అడిట్ అధికారిగా రెండు పదవుల్లో కొనసాగుతున్నారు. హాస్టల్స్ కార్యాలయంలో బిల్లులను స్వయంగా తయారు చేసి, అయనే చెల్లించే వెలుసుబాటు ఉంది. అందుకే కాంట్రాక్టర్లను డబ్బులు అడిగారనే ఆరోపణలున్నాయి. ఒకే అధికారి బిల్లు రూపొందించే పదవిలో కొనసాగుతూ అదే బిల్లును చెల్లింపు చేసే అధికారం కల్పించడం తోనే అవినీతికి బీజం పడిందని తెలుస్తోంది.

ఫోన్ రికార్డులు లీక్

ఏబీసీ అధికారులకు చిక్కిన కేయూ అడిట్ ఆఫీసర్ కిష్టయ్య కాంట్రాక్టర్ పి.రాజేందర్‌తో జరిపిన ఫోన్ రికార్డులు వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్నాయి. కాంట్రాక్టర్ రాజేందర్‌తో పాటు ఇతర సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్ల నుంచి లంచాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఏసీబీ అధికారులకు కిష్టయ్య బాధితుడు ఫోన్ రికార్డులను కూడా అందచేశారు.

వర్సిటీ ఉద్యోగుల గుండెల్లో రైళ్లు

వర్సిటీలో కొందరు ఉద్యోగుల అవినీతికి అడ్డూ అదుపూ లేదు. నేరుగా కళాశాలల అధికారులు డబ్బులు వసూలు చేసుకుంటున్నారని తెలుస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి వచ్చే కళాశాలల ప్రిన్సిపాల్‌తోపాటు ప్రయివేటు కళాశాలల యాజమాన్యాల నుంచి విచ్చలవిడిగా లంచాలు తింటున్నారనే ఆరోపణలున్నాయి. డబ్బులు చెల్లించని కళాశాలలకు నిబంధనల పేరుతో అనుమతులను అపేస్తారనే అపవాదులున్నాయి డబ్బులిస్తే అన్ని ఆల్‌రైట్ అనే చర్చ జరుగుతోంది. కళాశాలల తనిఖీల పేరుతో వర్సిటీ ఉన్నతాధికారులకు నచ్చిన అధికారులను బృందాలుగా ఏర్పాటు చేసుకుని వాటాలు పంచుకుంటున్నారని తెలుస్తోంది. పరీక్షల విభాగంలో విద్యార్థుల నుంచి సర్టిఫికెట్ల నుంచి మొదలుకుని ఇతర పనులన్నింటికీ డబ్బులు వసూలు చేస్తారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

అందుబాటులో ఉండి సేవ చేస్తా..

నియోజకవర్గంలో ప్రతీ ఎకరాకు సాగు నీరు అందిస్తా.. : రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

ఎల్కతుర్తి, జనవరి 5: మంత్రి పదవి హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు తనకు ఇచ్చిన గౌరవమని, అన్ని వేళలా అందుబాటులో ఉంటూ సేవ చేసుకుంటానని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఎల్కతుర్తి మండల కేంద్రానికి మంత్రి పొన్నం మొదటి సారి రాగా, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో మండల కేంద్రానికి చేరుకున్నారు. బస్టాండ్ కూడలి వద్ద మంత్రికి పూలమాలలు వేసి బాణాసంచా పేల్చుతూ స్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిరు వ్యాపారులను కలుస్తూ ఆప్యాయంగా పలకరించారు. మంత్రితో సెల్ఫీ తీసుకుంటూ ప్రజలు సందడి చేశారు. అనంతరం ఎస్ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో గ్రామాల వారీగా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పదేళ్ల టీఆర్ఎస్ పాలనలో గ్రామాల్లో అనేక సమస్యలు నెలకొన్నాయన్నారు. వాటి పరిష్కారానికి గ్రామాల్లో ఎన్నికల సమయంలో ఏ విధంగా పర్యటించానో ఆదే విధంగా వచ్చి దశల వారీగా సమస్యలను పరిష్కరిస్తానన్నారు. హుస్నాబాద్ నియోజకపరిధిలో ఉన్న ప్రాజెక్టుల ద్వారా ప్రతీ ఎకరాకు సాగు నీరు అందించే విధంగా చర్యలు చేపడుతానని హామీ ఇచ్చారు. గౌరవెల్లి, వరద కాలువ ఫేస్ - 2, శ్రీరాం సాగర్, దేవాదుల కాలువల ద్వారా ఎంత వీలైతే అంత ఎక్కువగా సాగు నీరు అందించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో అనారోగ్యం బారిన పడిన వ్యక్తులకు ఆస్పత్రుల్లో నాణ్యమైన చికిత్స అందించడానికి నియోజక వర్గంలో ప్రత్యేక వ్యక్తిని ఏర్పాటు చేసినట్లుగా తెలిపారు. రోడ్లు, కుల సంఘాలు, తాగునీటి సమస్యలు, బస్సుల కొరత వంటి సమస్యల తీవ్రతను బట్టి పరిష్కారానికి ముందుకు తీసుకెళ్లుతానని హామీ ఇచ్చారు. భారీ మెజారిటీతో గెలిపించి తనకు రాష్ట్ర కేబినెట్‌లో స్థానం కలుగడానికి కృషి చేసిన ప్రజలందరికీ రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, టీపీసీసీ సభ్యులు బొమ్మనపెల్లి అశోక్‌రెడ్డి, సర్పంచ్‌లు చల్లా మల్లారెడ్డి, రవిందర్‌రెడ్డి, రాము, నాయకులు గోలి రాజేశ్వర్ రావు, సంతాజీ, రమేష్, అక్తర్, మహేందర్, శ్రీకాంత్, రాజు, నవీన్, సంపత్, గంగాధర్, శ్రీధర్, వెంకటేష్, స్వరూప, సుష్మ, తోకల శ్రీనివాస్, పున్నం పాల్గన్నారు.


ఎల్కతుర్తిలో కార్యకర్తలతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్


మంత్రికి పూలమాల వేస్తున్న నాయకులు

వినతుల వెల్లువ

మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో దశాబ్దాలుగా నెలకొన్న సమస్యలపై గ్రామస్థులు, కార్యకర్తలు వినతి పత్రాలను మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అందజేశారు. గ్రామాల్లో రోడ్లు, కమ్యూనిటీ భవనాలు లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని నాయకులు వాపోయారు. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. మండల కేంద్రంలో ప్రభుత్వ భూమిలో ఏర్పాటుచేసుకున్న నివాసాలకు విద్యుత్, డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలని కాలనీవాసులు విన్నవించుకున్నారు. మోడల్ పాఠశాల విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని పాఠశాల ఉపాధ్యాయులు వినతి పత్రాన్ని అందజేశారు.



మహిళలకు శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

మహిళలు లాభాలు సాధించాలి

మామునూరు, జనవరి 5 : పాల ఉత్పత్తుల తయారుతో మహిళలు లాభాలు సాధించాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం (కేవీకే)కో ఆర్డినేటర్ డాక్టర్ రాజన్న అన్నారు. మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం మహిళలకు పాలు, పాల ఉత్పత్తులపై శిక్షణ ఇచ్చారు. కట్రియాల, మలక్‌పల్లి, రంగశాయిపేట గ్రామాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమంలో గృహవిజ్ఞాన శాస్త్రవేత్త అరుణ్ జ్యోతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు. శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్స్ అందజేశారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

●'ప్రజా పాలన'లో మంత్రి కొండా సురేఖ ● ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఖిలావరంగల్, జనవరి 5: ప్రభుత్వ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని అటవీ, పర్యాటక, దేవాదాయశాఖా మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం శివనగర్‌లోని భూపేష్‌నగర్‌లో ప్రజాపాలన కార్యాలయాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కరాటే ప్రభాకర్ అధ్యక్షతన మంత్రి ప్రారంభించారు. ఈ మేరకు మంత్రి మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నారన్నారు. ప్రజలందరూ పథకాల అమలు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు స్వీకరించిన అధికారులు కంప్యూటరీకరించాలన్నారు. త్వరలో అర్హులైన ప్రజలందరికీ పథకాలను అమలు చేస్తామన్నారు. నేటితో ముగియనున్న ప్రజాపాలన దరఖాస్తులను పథకాలను కేంద్రాలలో అందజేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాల్లో సైతం అందజేయవచ్చునన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, 34వ డివిజన్ అధ్యక్షుడు చిట్టిమళ్ళ శ్రీనివాసరావు, నాయకులు గజ్జెల లింగమూర్తి, శామంతుల శ్రీనివాస్, కరాటే ఉమ, కరాటే సంగీత్‌రాజ్, విజయరాం చందర్, శామంతుల కిరణ్, మణేమ్మ, బి.వెంకటేశ్వర్లు, అంజమ్మ, నకినబోయిన శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. భూపేష్‌నగర్‌లోని మైసమ్మదేవాలయంలో కరాటే ప్రభాకర్-ఉమ దంపతులు మంత్రికి ఘనస్వాగతం పలికారు. డీఎస్సీ ద్వారా నియమించిన 398స్పెషల్ టీచర్లకు జీఓఎంఎస్ నెంబర్ 28 ద్వారా 2019 ప్రకారం నోషనల్ ఇంక్రీమెంట్స్, పెన్షన్‌బెనిఫిట్స్ మంజూరు చేయాలని మంత్రికి 398 స్పెషల్ టీచర్స్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకుడు కె.సుధాకర్, పి.పెద్దన్నలు వినతిపత్రాన్ని అందజేశారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం..

కరీమాబాద్ : ఆరుగ్యారంటీలను అమలు చేయడమే లక్ష్యంగా ముందుకు పోతుందని మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం ఉర్సు సీఆర్సీ భవ నంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తు కేంద్రాన్ని సందర్శించారు. మంత్రి మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన గ్యారెంటీలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యబీమా రూ.5లక్షల నుంచి 10లక్షల వరకు పెంచడం జరిగిందన్నారు. మిగిలిన గ్యారెంటీలను కూడా త్వరలోనే అమలు చేస్తామన్నారు. ప్రగతి భవన్ ముందు కంచెలు తీసేసి ప్రజావాణి వినిపించే వేదికగా మార్చడం జరిగిందన్నారు. ప్రజావాణి పేరిట వేలాదిమంది ప్రజలు అక్కడికి రావడం కన్నా మనమే ప్రజల వద్దకు వెళ్లే బాగుంటుంది అనే ఆలోచనతో ఈ ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. దరఖాస్తులను సంబంధిత అధికారులు ప్రతీ ఇంటికి వెళ్లి విచారణ చేపట్టి అర్హులను గుర్తించి గ్యారెంటీలను అమలు చేసేలా చర్యలు చేపడుతారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మీసాల ప్రకాష్, కేడల పద్మ జనార్ధన్, మంతెన సునీత, బాసాని శ్రీనివాస్, గడ్డం యుగేందర్, దాసి రాందేవ్, ఆవునూరి రవి, ఆనందం, కుమార్, దేవేందర్ పాల్గొన్నారు.



భూపేష్‌నగర్‌లో ప్రజాపాలన రిసిప్టును అందజేస్తున్న మంత్రి సురేఖ



చింతలపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ఉన్న వనరులతోనే అభివృద్ధి చేస్తాం..: రేవూరి

సంగెం, జనవరి 5: ప్రస్తుతం ఉన్న వనరులను ఉపయోగించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కాట్రపల్లి, చింతలపల్లి గ్రామాల్లో 'ప్రజా పాలన' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసిందని, ఎంతో ధైర్యంతో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్తున్నారన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ ప్రజలకు జవాబుదారిగా నిలవాలన్నదే ప్రభుత్వం లక్ష్యమన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలను అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రజల తీర్పును గౌరవించక, విద్దూరమైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సర్పంచులు ఇండ్ల రవికుమార్, పులుగు సాగర్‌రెడ్డి, ఎంపీపీ కళావతి, జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, ప్రచూర్ణ, ఉపసర్పంచ్ రాధిక, ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, ఎంపీవో రవీందర్ పాల్గొన్నారు.

పొరపాట్లు లేకుండా సమాచారాన్ని నమోదు చేయాలి..



డీఆర్‌డీఏ భవన్‌లో శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ , అధికారులు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 5: ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల సంబంధిత సమాచారాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. శుక్రవారం జిల్లా డీఆర్‌డీఏ భవన్‌లో ఏర్పాటు చేసిన డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన సమాచారం ఆధారంగానే ప్రభుత్వం వివిధ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేయనుందని, ప్రజలు ఇచ్చిన వాస్తవ సమాచారాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో పీడీ సంపత్‌రావు, వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్ జోనా, జిల్లా సహకార శాఖ అధికారి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

వేములవాడలో అతిథిగృహం వితరణ

వరంగల్ కలెక్టరేట్, జనవరి 5: వేములవాడలో భక్తుల కోసం వసతి గృహం శివ సదనం పేరుతో నగరానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త, వరల్డ్ పద్మశాలీ క్లబ్ వ్యవ స్థాపకులు రామా శ్రీనివాస్ తమ తల్లిదండ్రుల పేరిట వసతి గృహం నిర్మించి దేవస్థానానికి అందజేశారు. శుక్రవారం ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్‌కు అతిథి గృహం తాళాలు అందజేశారు. ఇటీవల దేవస్థానం అన్నదానానికి రూ. 8 లక్షలను విరాళం సైతం అందించారు.



ఈవో కృష్ణప్రసాద్‌కు అతిథి గృహం తాళాలు అందజేస్తున్న రామా శ్రీనివాస్

పుట్టిన ఊరి రుణం తీర్చుకుంటా

• మంత్రినైనా మీ బిడ్డనే..: మంత్రి సీతక్క

• స్వగ్రామం జగ్గన్నపేటలో ఘన స్వాగతం

ములుగు, జనవరి 5: తనకు జన్మనిచ్చి ఎదుగుదలకు ఊతమిచ్చిన జగ్గన్నపేట గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటానని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి శుక్రవారం ములుగు మండలంలోని స్వగ్రామానికి వెళ్లారు. అభిమాన నాయకురాలికి గ్రామస్తులు ఎదురేగి స్వాగతం పలికారు. ఆరాధ్య దైవమైన పుట్టమల్లన్నను దర్శించుకున్న సీతక్క నేరుగా తన ఇంటికి వెళ్లి తల్లిదండ్రులు సమ్మక్క-సమ్మయ్యల ఆశీర్వాదం తీసు కున్నారు. తన సోదరుడు సాంబయ్య సమాధిని సందర్శించి నివాళులు అర్పించారు. ఆ తర్వాత గ్రామస్థులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన సభలో సీతక్క పాల్గొన్నారు. పూలమాలలు శాలువాలతో సీతక్కను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. చిన్ననాటి స్నేహితులు, ఆత్మీయులను సీతక్క పలకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తాను మంత్రిగా ఎదిగినా ఎప్పుడూ మీ ఆడబిడ్డనేనని అన్నారు. మీరు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా జగ్గన్నపేట గ్రామాన్ని ఆదర్శవం తంగా తీర్చిదిద్దుతానని అన్నారు. మూడుసార్లు తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ములుగు నియోజకవర్గాన్ని ప్రగతిలో ముందువరుసలో నిలబెడతానని, కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రతీ అర్హుడికి చేరువ చేస్తానని తెలిపారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తానని, అన్నివర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పని చేస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కూచన రవళిరెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సూర్య కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రేగ కళ్యాణి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లాడి రాంరెడ్డి, పార్టీ ములుగు మండల అధ్యక్షుడు ఎమ్డీ.చాంద్‌పాషా, జగ్గన్నపేట ఉప సర్పంచ్ సదానందం, నాయకులు నూనేటి శ్యామ్, అర్రెం వెంకన్న, వెంకన్న పాల్గొన్నారు.



సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

వంచనగిరిలో ప్రజాపాలన

గీసుగొండ, జనవరి 5: వంచనగిరిలో ప్రజాపాలన గ్రామ సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీవో వీరేశం మాట్లాడుతూ మండలంలో మొత్తం 10571 కుటుంబాలు ఉండగా 8580 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. శనివారంతో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగుస్తుందన్నారు. ఈనెల 17 లోపు వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి దేవేందర్, సర్పంచ్ అనసూర్య, ఎంపీటీసీ రజిత, కార్యదర్శి నరేష్, ఏవో హరిప్రసాద్‌బాబు, ఏపీఎం సురేష్ పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఉన్మాదం

» కన్నతల్లిని రోకలితో కొట్టి చంపిన కొడుకు

» అడ్డువచ్చిన మరో మహిళపైనా దాడి

» నిందితుడిని బంధించిన ప్రజలు



హైమ (ఫైల్)

రేగొండ, జనవరి 5: మతిస్థిమితం తప్పిందో... ఉన్మాదమో తెలియదుగానీ అతడు.. తన కన్నతల్లినే దారుణంగా హత్య చేశాడు. అడ్డు వచ్చిన మరో మహిళ పైనా దాడికి దిగడంతో మృత్యువుతో పోరాడుతోంది. ఈ దారుణ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం తిరుమలగిరిలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఉన్మాది తీరుతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. తల్లిని చంపిన అనంతరం ఉన్మాది అక్కడి నుంచి పరారై మరో గ్రామంలో తిరుగుతుండగా గ్రామస్థులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. కుటుంబ సభ్యులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన ప్రకారం... తిరుమలగిరికి చెందిన కంచర్లకుంట్ల మోహన్‌రెడ్డి-హైమ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రాజిరెడ్డి(42) భార్య సరితతో కలిసి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతని ఇద్దరు కుమారులు హనుమకొండలో ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్నారు.

రాజిరెడ్డి కొంతకాలంగా మానసిక రుగ్మతతో బాధపడుతూ అప్పుడప్పుడు భార్యతో గొడవ పడేవాడు. ఐదేళ్లుగా ఎలాంటి సమస్య లేకుండా ఉన్న రాజిరెడ్డి... పది రోజులుగా నిద్రపోకుండా గొడవ చేస్తూ తనకు శక్తి ఆవహించిందని చెప్పడం మొదలుపెట్టాడు. దీంతో అతనికి భార్య సరిత, తల్లి హైమ తాయత్తు కట్టించారు. గురువారం అర్ధరాత్రి రాజిరెడ్డి మళ్లీ గొడవకు దిగాడు. తెల్లవారాక ఆస్పత్రికి వెళ్దామని పడుకోమని చెప్పగా 'నన్ను ఏం చేస్తున్నారు.. చంపుతారా..' అంటూ తల్లి, భార్యపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దుర్భాషలాడాడు. దీంతో తల్లి హైమ, భార్య సరిత భయంతో ఎదురుగా ఉన్న తమ ఇంట్లోకి వెళ్లి పడుకున్నారు. రాజిరెడ్డి ఊరుకోకుండా బయటికి రాకపోతే ఇంట్లో ఉన్న పత్తి కాలబెడుతా అంటూ హెచ్చరించడంతో తల్లి బయటకు వచ్చింది. ఈ సమయంలో రాజిరెడ్డి పక్కనే ఉన్న రోకలి తీయడంతో తల్లి, భార్య చెరో వైపు పరిగెత్తారు. తొలుత తల్లి హైమ(60)తలపై విచక్షణ రహితంగా దాడి చేయగా, ఆమె తల భాగం మొత్తం ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందింది. ఇదే సమయంలో పక్కింట్లో ఉన్న ఊకంటి జ్యోతి బయటకు వచ్చి అడ్డుకోబోగా ఆమెపై దాడి చేయడంతో తీవ్ర గాయాలతో కింద పడిపోయింది. నిందితుడి భార్య పారిపోయి చుట్టుపక్కల వారిని తీసుకువచ్చేలోగా 'ఇద్దరిని చంపేసిన.. ఎవరు వస్తారో రండి.. అందరిని చంపుతా..' అని రాజిరెడ్డి ముందుకు రావడంతో అందరూ భయంతో ఇళ్లల్లోకి వెళ్లిపోయారు. అనంతరం నిందితుడు రోకలితో పారిపోయాడు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ వేణుచందర్, ఐదుగురు ఎస్సైలు, పోలీసు సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. గాయపడిన జ్యోతిని అంబులెన్సులో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం ఉదయం వరకు నిందితుడి కోసం గాలించారు.కాగా, గోరికొత్తపల్లి మండలంలోని చిన్నకోడెపాకలో రాజిరెడ్డి అనుమానాస్పదంగా తిరుగుతుండగా గ్రామస్థులు పట్టుకుని కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందితో చేరుకుని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డీఎస్పీ రాములు ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రత్యక్ష సాక్షులు, కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కాపాడబోయి ప్రాణాల మీదకు...

పక్క ఇంట్లో గొడవ జరుగుతందని తెలిసి నిద్రలేచి బయటకు వచ్చి కాపాడబోయిన జ్యోతి(బంధువు) ప్రాణాలకే ప్రమాదం ఏర్పడింది. రాజిరెడ్డి దాడిలో గాయపడ్డ జ్యోతి కోమాలోకి పోగా హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

రంగశాయిపేటలో ఘనంగా అయ్యప్ప పడిపూజ

శంభునిపేట, జనవరి 5 : రంగశాయిపేటలోని రామలింగేశ్వరాలయం అయ్యప్ప శరణుగోషతో మార్మోగింది. ఆలయ అర్చకులు, గురుస్వామి వెలిదె ప్రదీప్‌శాస్త్రి చేతుల మీదుగా శుక్రవారం ఆలయ ఆవరణలో అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. మండ మంజుల వెంకన్నగౌడ్, కత్తి లావణ్య దేవేందర్, ఆలయ చైర్మన్ ముత్తినేని రామ్మూర్తిల ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. 18 మెట్లపై పడులను వెలిగించి జ్యోతి స్వరూపుడికి దూప దీప నైవేద్యాలు సమర్పించారు. నారికేళ గురుస్వామి కొల్లూరి యోగానంద్ అయ్యప్ప సంకీర్తనలు అలరించాయి. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందనపూర్ణచందర్, గురుస్వాములు మిట్టపల్లి కపిల్, అంకాల శ్రీనివాస్, కొండ్రెడ్డి నవీన్‌రెడ్డి, నల్లతీగల వెంకన్న, కత్తెరపల్లి వేణు, మునుకుంట్ల శ్యామ్, కొక్కొండ బాస్కర్, నరేష్, పెద్ద సంఖ్యలో అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.



రంగశాయిపేట రామలింగేశ్వరాలయంలో అయ్యప్ప పడి పూజ

ఎంసీపీ(ఐ) పార్టీని పటిష్టం చేయాలి

వరంగల్, జనవరి 5 : ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించేలా ప్రజలను సమాయత్తం చేసేలా ఎంసీపీ(ఐ) పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గోనే కుమారస్వామి అన్నారు. శుక్రవారం వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సెంటర్ సమీపంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాకుండా చూడాలని ప్రజలను కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, రాష్ట్ర నాయకులు మంద రవి, కొమురయ్య, బాబురావు, రాగసుధ, సదానందం, నర్సయ్య, మల్లికార్జున్, ప్రభాకర్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

గర్భంలోనే శిశువు మృతితో ఆందోళన

నర్సంపేట టౌన్, జనవరి 5: వైద్యులు అందుబాటులో లేకపోవడంతో గర్భంలోనే శిశువు మృతి చెందిన ఘటన నర్సంపేట జిల్లా ఆస్పత్రిలో ఈనెల 1న జరగగా శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత మహిళ భర్త సంగాల శివకృష్ణ కథనం ప్రకారం... నర్సం పేటలోని వల్లభ్ నగర్‌కు చెందిన సంగాల మమలత, శివకృష్ణ దంపతులు. శివకృష్ణ ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ భార్యను పోషించుకుంటున్నాడు. ప్రస్తుతం మమలత తొమ్మిది నెలల గర్భిణి(తొలికాన్పు). ఆమెకు రక్తస్రావం అవడంతో గత నెల 30న సాయంత్రం నర్సంపేట జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆస్పత్రిలో గైనకాలజిస్టు, డ్యూటీ డాక్టర్ సునీత లేకపోవడంతో, పీజీ వైద్యురాలు పరీక్షలు నిర్వహించి శిశువు హార్ట్‌బీట్ బాగానే ఉందని చెప్పారు. అయితే శిశువు ఉమ్మ నీరు మింగిందని, నార్మల్ డెలివరీ చేయాలని భావించగా, నొప్పులు రావడం లేదని వైద్య చికిత్సలందించారు. మరుసటి రోజు(డిసెంబరు 31) సిబ్బంది మమలతను పరీక్షించగా శిశువు గుండె కొట్టుకోవడం లేదని గుర్తించి డ్యూటీ డాక్టర్ సునీతకు సమాచారమిచ్చారు. పరీక్షలు నిర్వహించగా, గర్భసంచిలో లోపాలతో శిశువు మృతి చెందినట్లు గుర్తించి, కుటుంబ సభ్యులకు తెలిపారు. నార్మల్ డెలివరీ అయ్యే అవకాశం లేకపోవడంతో ఈనెల ఒకటిన సిజేరియన్ చేసి మృత శిశువును బయటకు తీశారు.

సకాలంలో మమలతను ఆస్పత్రికి తీసుకెళ్లినా.. డ్యూటీ డాక్టర్ అందుబాటులో లేకపోవడంతోనే శిశువు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు, ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. అందుబాటులో లేని డ్యూటీ డాక్టర్‌ను, సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలంటూ నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వారికి నచ్చజెప్పారు. దీంతో వారు ఆందోళన విరమింప చేశారు.

గర్భిణి మమలతకు ఆస్పత్రిలో పీజీ వైద్యురాలు పరీక్షలు నిర్వహించి, చికిత్స అందించారు. వైద్యుల నిర్లక్ష్యం లేదు. గర్భసంచిలో లోపాల వల్లనే శిశువు మృతి చెందినట్లు వైద్యురాలు కేస్ షీట్‌లో పేర్కొంది.

వస్తోంది.. వస్తోంది.. మల్లన్న జాతర

» 13 నుంచి 15 వరకు...

» ముస్తాబవుతున్న ఐనవోలు

» మొదలైన ఏర్పాట్లు



ఐనవోలు, జనవరి 5: లక్షలాది మందిని భక్తిభావంలో ముంచెత్తే ఐనవోలు మల్లన్న జాతర ఉత్సవాల ఏర్పాట్లకు అధికారులు శ్రీకారం చుట్టారు. ప్రతీఏటా మకర సంక్రమణంతో ప్రారంభమయ్యే జాతర ఉత్సవాలు ఉగాది వరకు కొనసాగుతాయి. స్వామి వారికి దృష్టికుంభం డిసెంబరు 17 ఆదివారం (ధనుసంక్రమణ) నిర్వహించారు. ఈ నెల 13న శనివారం ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ధ్వజారోహణం, నూతన వస్త్రాలంకరణం చేయనున్నారు. 14న ఆదివారం భోగి పండుగ నాడు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి దర్శించుకుంటారు. 15న సోమవారం మకర సంక్రాంతి రోజున రాత్రి దేవుడి రథం(బండ్లు) ఆలయం చుట్టూ తిరుగుతాయి. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి సైతం భక్తులు భారీగా తరలివస్తారు. 17న బుధవారం మహాసంప్రోక్షణ క్రతువు సమారాధన పూజ కార్యక్రమాలు జరుగుతాయి. ఫిబ్రవరి 14న బుధవారం వసంత పంచమి శ్రీభ్రమరాంభిక అమ్మవారి దశమ వార్షికోత్సవం, 24న శనివారం రేణుకాదేవి(ఎల్లమ్మదేవత) పండగ నిర్వహించనున్నారు.

శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలు

శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మార్చి 6 నుంచి 10 వరకు పాంచాహ్నిక దీక్షతో త్రికుండాత్మకంగా భ్రమరాంభికా మల్లికార్జునస్వామి వారి కల్యాణ బ్రహ్మోత్సవాలు శైవాగమోక్తంగా నిర్వహించనున్నారు. 6న బుధవారం సూర్య చంద్ర ప్రభ వాహనసేవలు, 7న గురువారం అశ్వవాహన సేవ, శేషవాహనసేవ, 8న శుక్రవారం మహాశివరాత్రి శివ కల్యాణం, పెద్దపట్నం, సింహవాహనసేవ, రాత్రి 7 గంటలకు శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి వారి కల్యాణం, తదుపరి నంది వాహనసేవ నిర్వహిస్తారు. 9న శనివారం రావణ వాహనసేవ, రథోత్సవం, పుర వీధి సేవ, 10న ఆదివారం పర్వతవాహనసేవ, వసంతోత్సవం, పండితసన్మానాలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 7న ఆదివారం పెద్దపట్నం కల్యాణం, 9న మంగళవారం ఉగాదిని పురస్కరించుకుని పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు.

వారంతపు జాతర

జనవరి 21 నుంచి ఏప్రిల్ 3 వరకు వారంతపు జాతరలు ప్రతీ ఆది, బుధ వారాల్లో జరుగుతాయి. ఈ సంవత్సరం మొత్తం 12 ఆదివారాలు, 11 బుధవారాల వారాంతపు జాతరలు నిర్వహిస్తారు. జాతరలకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వచ్చి దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకుంటారని, సకల ఏర్పాట్లు చేస్తామని ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

వరంగల్, జనవరి 5 : భద్రకాళీ దేవాలయం ప్రాంగణంలో శుక్రవారం వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించింది. ఆలయ ఈవో గాయత్రి, ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు సహకారంతో కళాశాల సూపరింటెండెంట్ జగన్మోహనాచారి ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. 250మందికి పరీక్షలు చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ మెడికల్ ఆఫీసర్లు ఎస్.స్వరూప, శ్రీలత, కవిత,కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు బి.కేదారి, అపర్ణలు, హౌస్ సర్జన్‌లు తేజ శ్రీ, దేవేందర్ పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL శనివారం 6 జనవరి 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

నర్సంపేట టౌన్, జనవరి 5: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన నర్సంపేట పట్టణంలోని మహబూబాద్ రోడ్డులో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం నర్సంపేట పట్టణంలోని కమలాపురం గ్రామానికి చెందిన ముఖేష్ తన ద్విచక్రవాహనంపై ఆయన సోదరి కల్యాణి, మణికంఠలను తీసుకొని ఖానాపురం నుంచి నర్సంపేట వైపు వస్తున్నాడు. ఇదే క్రమంలో మహబూబాబాద్ రోడ్డులోని రైస్ మిల్లు వద్దకు రాగా, ఎదురుగా లారీ రావడంతో లారీ, బైక్ ఢీకొన్నాయి. దీంతో కిందపడిపోయిన ముఖేష్, కల్యాణి, మణికంఠలకు గాయాలయ్యాయి. వెంటనే వీరిని చికిత్స నిమిత్తం నర్సంపేట ఆస్పత్రికి తరలించారు. తీవ్రగాయాలైన కల్యాణిని వరంగల్ ఎంజీఎంకు ఆస్పత్రి వైద్యులు రెఫర్ చేశారు.

అభయహస్తం గ్యారంటీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

• వరంగల్ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



నందిగామలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

నల్లబెల్లి, జనవరి 5 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజాపాలన గ్రామ సభల్లో అర్హులైన ప్రజలందరు అభయహస్తం గ్యారంటీలను దరాఖాస్తుల రూపంలో సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని నందిగామ, నారక్కపేట, కన్నారావుపేటల్లో ప్రజాపాలన గ్రామ సభలను నిర్వహించారు. అయితే నందిగామ ప్రజాపాలన గ్రామ సభకు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య హాజరై, మాట్లాడారు.. ప్రజాపాలనలో ప్రతీ ఒక్కరూ ఈ నెల 6వ తారీఖు వరకు దరాఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. అర్హులైన ప్రతీ కుటుంబానికి లబ్ధిచేకూరే విధంగా త్వరలోనే పరిశీలన కమిటీలను కూడా వేస్తామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి భాగ్యలక్ష్మి, తహసీల్దార్ బొనగాని రాజేష్, ఎంపీడీవో విజయ్ కుమార్, ఎంపీవో కూచన ప్రకాష్, సర్పంచ్ నాగులగాని సలేంద్రనాగేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

అభయహస్తంలో అక్రమాలకు తావులేదు

• మునిసిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్

నర్సంపేట, జనవరి 5 : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న అభయహస్తం పథకంలో అ క్రమాలకు తావులేదని మునిసిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్ అన్నారు. పట్టణంలోని 20, 21వ వార్డుల్లో శుక్రవారం అధికారులు ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ నాయిని వెంకటస్వామి, ఎంఈవో రత్నమాల, ఏవో కృష్ణకుమార్‌తో కలిసి మహిళలకు అభయహస్తం దరఖాసులను పంపిణీ చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ అభయహస్తం పథకాన్ని అర్హులైన ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శనివారంతో గ్రామసభలు ముగుస్తాయని దరఖాస్తులు చేసుకోని వారు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రజాపాలన గ్రామ సభలు ప్రతీ నాలుగు నెలల కొకసారి జరుగుతాయన్నారు. దరఖాస్తు చేసుకోని వారు మళ్లీ చేసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు గాజుల రమేశ్, 21వ డివిజన్ నాయకుడు దండెం రథన్‌కుమార్, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వేముల సారంగం గౌడ్, కార్యదర్శి కొంకీస మదన్‌గౌడ్, నాంపల్లి వెంకటేశ్వర్లుగౌడ్, సాయిపటేల్, ఉత్తమ్‌కుమార్, జీజుల కార్తీక్‌తో పాటు ఆర్‌పిలు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

నెక్కొండ, జనవరి 5 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రాజకీయాలకు అతీతంగా అందిస్తుందని, అందులో భాగంగానే ప్రజాపాలన గ్రామసభలను నిర్వహిస్తుందని మండలంలోని పత్తిపాక గ్రామ సర్పంచ్ లావుడ్యా సరితాతిరుమల్ అన్నారు. మండలంలోని పత్తిపాక, దీక్షకుంట, సూరుపల్లి గ్రామాల్లో శుక్రవారం ప్రజాపాలన గ్రామ సభలను నిర్వహించారు. అర్హులందరూ సంక్షేమ పథకాలను పొందుటకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జేడీఏ ఉషాదయల్, టీం లీడర్లు తహసీల్దార్ రాజ్‌కుమార్, ఏవో నాగరాజు, ఎంపీవో పర్వీన్, వెలుగు ఏపీఎం శ్రీనివాస్, సూరుపల్లి, దీక్షకుంట సర్పంచ్‌లు సింగారపు గీతాభాస్కర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన ప్రజా పాలన గ్రామ సభలు

చెన్నారావుపేట, జనవరి 5: మండలంలోని జోజిపేట నారయణతండా, పత్తినాయక్‌తండా, సూర్యపేటతండా, గొల్లబామ తండాతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం ప్రజా పాలన గ్రామ సభలు కొనసాగాయి. ఈ సందర్భంగా జిల్లా పశువైద్యాధికారి బాలకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 6 వరకు ప్రజా పాలన గ్రామ సభలు కొనసాగుతాయన్నారు. తీసుకున్న దరఖాస్తులను ఆన్‌లైన్ నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పత్తినాయక్, ఎంపీడీవో భారతి, తహశీల్దార్ ఫణికుమార్, ఎంపీవో శ్రీధర్‌రాజు, ఏఈ మంగీలాల్, సూపర్ వైజర్ మంజుల సర్పంచ్‌లు అంద్ర విజయబాలజ్యోజి, స్వామినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీల గడువు మరోసారి పొడిగింపు

• పాత కమిటీలతోనే పర్యవేక్షణ



వర్ధన్నపేట, జనవరి 5 : విద్యార్థుల చదువుతో పాటు పాఠశాలలకు మంజూరైన నిధులు సక్రమంగా వినియోగించేలా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)ల పాత్ర కీలకం. ఇలాంటి ప్రాధాన్యత ఉన్న కమిటీల నిర్వహణ ప్రస్తుతం నీరుగారుతోంది. ఆ పాఠశాలలో తమ పిల్లలు చదువులు పూర్తి చేసుకొని ఉన్నత విద్యకు వెళ్లినప్పటికీ పాత వారే కమిటీ సభ్యులుగా, చైర్మన్లుగా వ్యవహరిస్తున్నారు. దీనికి తోడు బడి వైపు కన్నెత్తి చూడకపోవడంతో ఎస్ఎంసీ కమిటీల లక్ష్యం నెరవేరని పరిస్థితి. 2019లో ఈ కమిటీలను ఏర్పాటు చేయగా 2021లో గడువు ముగిసింది. అయినా మూడు సార్లు గడువు పెంచిన విద్యాశాఖ తాజాగా మరి కొన్ని నెలపాటు పొడిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త కమిటీలు ఏర్పాటయ్యే వరకు వీరే కొనసాగుతారని స్పష్టం చేసింది.

• తల్లిదండ్రుల భాగస్వామ్యం

ఎస్ఎంసీలో విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం కీలకం. ఉపాధ్యాయులు సక్రమంగా విధులకు హాజరు అవుతున్నారా, సమయ పాలన పాటిస్తున్నారా అనే వాటిని ఈ కమిటీ పర్యవేక్షించాలి. దీంతోపాటు నాణ్యమైన బోధన, భోజనం అందిస్తున్నారా అనే విషయాలపై ఎప్పటికప్పుడు ఆరా తీయాల్సి ఉంటుంది. విద్యార్థుల అభ్యసన తీరుపై సమావేశం నిర్వహించి తల్లిదండ్రులకు వివరించాలి. పాఠశాలకు నిధులు మంజూరైతే తీర్మానం చేసి పనులు చేపట్టాల్సి ఉంటుంది. ప్రస్తుతం మన ఊరు, మన బడి కొనసాగుతున్నప్పటికీ చాలా ఎస్ఎంసీలు వీటి నిర్వహణ పట్టించుకోవడం లేదు.

• నీరుగారుతున్న లక్ష్యం

విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో పాఠశాల నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎస్ఎంసీ ద్వారా సులభంగా సాధించే అవకాశం ఉంటుంది. విద్యార్థులు సక్యంగా పాఠశాలకు హాజరు కాకపోయినా, బడి ఈడు పిల్లలు బడి బయట ఉన్నా, పాఠశాలలకు అభివృద్ధి కోసం ఏదైనా నిధులు మంజూరు అయినా చర్చించి పనులు చేపట్టాలి. మరోవైపు ఇప్పటికే సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య రోజురోజుకు తగ్గుముఖం పడుతుంది. తల్లిదండ్రులు ప్రైవేటు వైపు మొగ్గు చూపుతుండటంతో వీటిని మరింత బలోపేతం చేయాల్సి అవసరం ఉంది. అయితే కమిటీల గడువు ముగిసినప్పటికీ పదవీ కాలం తరుచూ పొడిగిస్తుండటంతో అనుకున్న లక్ష్యాలు నెరవేరడం లేదు.

• చాలా కీలకం

చైర్మన్, వైస్ చైర్మన్‌లు ప్రతి రోజు విధిగా మధ్యాహ్నా భోజనం, విద్యార్థుల హాజరు, ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాల పంపిణీ వంటి అంశాలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. మూత్రశాలలు, మంచినీరు, మైదానాలు, క్రీడా సామగ్రి తదితర సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరుకు కృషి చేయాలి. నిర్వహణ నిధులు ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్ జాయింట్ ఖాతాలో వేస్తారు. వీటిని సక్రమంగా వినియోగించాల్సి ఉంటుంది.

• జిల్లాలో 706 పాఠశాలలకు గాను 706 మంది ఎస్ఎంసీ చైర్మన్‌లు ఉన్నారు. ఈ పాఠశాలల్లో 42వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

ఇంటింటికి అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ



నర్సంపేటలో రామయ్య అక్షింతల పంపిణీకి పూర్ణకుంభంతో వెళ్తున్న రామ భక్తులు

నర్సంపేట, జనవరి 5 : పట్టణంలోని రామాలయంలో అయోధ్య నుంచి వచ్చిన అయోధ్య రామయ్య అక్షింతలకు ఆలయ పూజారి నాగరాజు శుక్రవారం పూజలు చేసి పూర్ణకుంభం కార్యక్రమంతో అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం 13, 14, 15వార్డుల్లో ఇంటింటికీ రామభక్తులు తిరిగి అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామభక్తులు బాల్నె జగన్, గూడూరు సందీప్, తక్కళ్లపల్లి ఉమాదేవితో పాటు, మహిళలు, రామభక్తులు, యువకులు పాల్గొన్నారు.

• చెన్నారావుపేట : మండలంలోని లింగాపురం గ్రామంలో శ్రీరామ జన్మభూమి పూజిత అక్షింతల వితరణ కార్యక్రమంలో శుక్రవారం ఇంటింటికి సర్పంచ్ తప్పెట రమేష్ వెళ్లి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న అయోధ్యలో శ్రీ బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని, ఆదే రోజు సాయంత్రం ప్రతీ ఒక్కరూ ఇంటికి 5 దీపాల చొప్పున వెలిగించాలన్నారు. ఇంటింటిని విద్యుత్ దీపాలతో అలంకరించుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరూ ఇంటిని శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గో సేవక్ జిల్లా ప్రముక్ విభూది శివకుమార్, ఎంపీటీసీ పసునూటీ రమేష్, ఉప సర్పంచ్ వేములపల్లి రాజు, అమ్మిరెడ్డి, మినుముల రాజు, రాగిరికర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

• వర్ధన్నపేట రూరల్ : ఈ నెల 22న అయోధ్యలోని రామమందిరంలో బాలరాముని ప్రతిష్ఠాపన ఉత్సవంలో పాల్గొని ప్రతీ ఒక్కరు తరించాలని కరసేవకుడు నక్క అంజయ్య సూచించారు. శుక్రవారం మండలంలోని బండౌతపురంలో శ్రీరామ తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో అందచేసిన శ్రీరాముని అక్షింతలను గ్రామంలో ర్యాలీగా ఇంటింటికి వితరణ చేశారు. ఆయన మాట్లాడుతూ హిందువుల ఆరాధ్య దైవమైన శ్రీరాముడు అయోధ్యలో కొలువుదీరడంతో దేశ ప్రగతి ఎంతో ఉన్నతికి చేరుతుందని అన్నారు. లోక కల్యాణం కోసం ప్రతీ ఒక్కరు రాముని సేవలో తరించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, కర సేవకులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నర్సంపేట, జనవరి 5 : ప్రపంచ విద్యా వ్యవస్థలో తమదై న ముద్రవేసిన మహనీయుల చిత్రాలతో రూపొందించిన లీడ్ ఫౌండేషన్ క్యాలెండర్లను పట్టణంలోని క్యాంప్ కార్యాల యంలో శుక్రవారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆవిష్కరిం చారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయం అభివృద్ధితో పాటు ఉద్యోగ అభ్యర్థుల కోసం గ్రంథాలయ సమయాన్ని పొడగించే లా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో తక్కళ్ల పల్లి రవీందర్ రావు, వేముల సాంబయ్యగౌడ్, బత్తిని రాజేందర్, నాగెం నగేశ్, మధు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి

ఖానాపురం, జనవరి 5 : విద్యుత్ షాక్‌తో పాడి గేదె శుక్రవారం మృతి చెందింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకా రం... నర్సంపేట శివారు ద్వారకపేటకు చెందిన గుండం సురేష్‌కు చెందిన పాడి గేదె ఖానాపురం శివారులోని పాకాల వాగువెంట ఉన్న పంట పొలాల్లో మేతకు వెళ్లగా, వాగులో అమర్చిన విద్యుత్ మోటర్లకు అమర్చిన విద్యుత్ వైరు గేదెకు తగలడంతో షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. సంఘట న స్థలాన్ని విద్యుత్ శాఖ ఏఈ సంపత్ సందర్శించి మృతి చెందిన పాడిగేదేను పరిశీలించారు. మృతి చెందిన పాడి గేదె విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని, ప్రభుత్వపరంగా ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

అన్నదానం

నెక్కొండ, జనవరి 5 : కేసముద్రం లయన్స్ క్లబ్ ఆధ్వ ర్యంలో హంగర్ రిలీఫ్ కార్యక్రమంలో భాగంగా చార్టర్ ప్రెసిడెంట్ లయన్ డాక్టర్ కె.చంద్రశేఖర్ తండ్రి దివంగత విశ్వనాథం పేరిట నెక్కొండ మండలంలోని నాగారం గ్రామంలో శుక్రవా రం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమలో లయన్ ప్రెసిడెంట్ బెజ్జం ప్రేమ్‌కుమార్, సెక్రెటరీ పరంకుశం శ్రీహరి, ఎర్నం శ్రీరాములు, చింతల కరుణాకర్, మడిపెల్లి వెంకటేశ్, ప్రభాకర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పెరిక సంఘం అధ్యక్షుడిగా దేవేందర్ ఎన్నిక

చెన్నారావుపేట, జనవరి 5 : మండలంలోని ఖాదర్‌పేట గ్రామ పెరిక సంఘం అధ్యక్షుడిగా ఉప్పల దేవేందర్ శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా చింతం మహేందర్, ఉపాధ్యక్షుడిగా లక్కరాసు సాంబయ్య కోశాధికారిగా చింతం రాజేందర్, కార్యవర్గ సభ్యులుగా చింతం రాంబాబు. చిన్నచెట్టి రమేష్, చిన్నచేట్టి వెంకటేశ్, చింతం రాంబాబు, దిడ్డి ప్రశాంత్‌లను ఎన్నుకున్నారు.

వస్తోంది.. వస్తోంది.. మల్లన్న జాతర

• 13 నుంచి 15 వరకు...

• ముస్తాబవుతున్న ఐనవోలు

• మొదలైన ఏర్పాట్లు



ఐనవోలు, జనవరి 5: లక్షలాది మందిని భక్తి భావంలో ముంచెత్తే ఐనవోలు మల్లన్న జాతర ఉత్సవాల ఏర్పాట్లకు అధికారులు శ్రీకారం చుట్టా రు. ప్రతీఏటా మకర సంక్రమణంతో ప్రారంభమయ్యే జాతర ఉత్సవాలు ఉగాది వరకు కొనసాగుతాయి. స్వామి వారికి ధృష్టికుంభం డిసెంబ రు 17ఆదివారం (ధనుసంక్రమణ)నిర్వహించారు. ఈ నెల 13న శనివారం ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ధ్వజారోహణం, నూతన వస్త్రాలంకరణం చేయనున్నారు. 14న ఆదివారం భోగి పం డుగ నాడు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి దర్శించుకుంటారు. 15న సోమవారం మకర సంక్రాంతి రోజున రాత్రి దేవుడి రథం(బండ్లు) ఆలయం చుట్టూ తిరుగుతాయి. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి సైతం భక్తులు భారీగా తరలివస్తారు. 17న బుధవారం మహాసంప్రోక్షణ క్రతు వు సమారాధన పూజ కార్యక్రమాలు జరుగుతా యి. ఫిబ్రవరి 14న బుధవారం వసంత పంచమి శ్రీభ్రమరాంభిక అమ్మవారి దశమ వార్షికోత్సవం, 24న శనివారం రేణుకాదేవి (ఎల్లమ్మదేవత) పండగ నిర్వహించనున్నారు.

• శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలు

శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మార్చి 6 నుంచి 10 వరకు పాంచాహ్నిక దీక్షతో త్రికుండాత్మకంగా భ్రమరాంభికా మల్లికార్జునస్వా మి వారి కల్యాణ బ్రహ్మోత్సవాలు శైవాగమోక్తం గా నిర్వహించనున్నారు. 6న బుధవారం సూర్య, చంద్ర ప్రభ వాహనసేవలు, 7న గురువారం ఆశ్వవాహన సేవ, శేష వాహనసేవ, 8న శుక్రవారం మహాశివరాత్రి శివ కల్యాణం, పెద్దపట్నం, సింహవాహన సేవ, రాత్రి 7 గంటలకు శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి వారి కల్యాణం, తదుపరి నంది వాహనసేవ నిర్వహిస్తారు.

9న శనివారం రావణ వాహనసేవ, రథోత్సవం, పురవీధి సేవ, 10న ఆదివారం పర్వత వాహనసేవ, వసంతోత్సవం, పండితసన్మానాలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 7న ఆదివారం పెద్దపట్నం కల్యాణం, 9న మంగళవారం ఉగాదిని పురస్కరించుకుని పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు.

• వారంతపు జాతర

జనవరి 21 నుంచి ఏప్రిల్ 3 వరకు వారంత పు జాతరలు ప్రతీ ఆది, బుధ వారాల్లో జరుగుతాయి. ఈ సంవత్సరం మొత్తం 12 ఆదివారాలు, 11 బుధవారాల వారాంతపు జాతరలు నిర్వహిస్తారు. జాతరలకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వచ్చి దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకుంటారని, సకల ఏర్పాట్లు చేస్తామని ఈవో అద్దంకి నాగేశ్వర్ రావు, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ తెలిపారు.

ప్రాణం తీసిన ఉన్మాదం

» కన్నతల్లిని రోకలితో కొట్టి చంపిన కొడుకు

» అడ్డువచ్చిన మరో మహిళపైనా దాడి

» నిందితుడిని బంధించిన ప్రజలు



హైమ (ఫైల్)

రేగొండ, జనవరి 5: మతిస్థి మితం తప్పిందో... ఉన్మాదమో తె లియదుగానీ అతడు.. తన కన్న తల్లినే దారుణంగా హత్య చేశాడు. అడ్డు వచ్చిన మరో మహిళ పైనా దాడికి దిగడంతో మృత్యువుతో పోరాడుతోంది. ఈ దారుణ ఘట న జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం తిరుమలగిరిలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఉన్మాది తీరుతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. తల్లిని చంపిన అనంతరం ఉన్మాది అక్కడి నుం చి పరారై మరో గ్రామంలో తిరుగుతుండగా గ్రామస్థులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. కుటుంబ సభ్యులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన ప్రకారం... తిరుమలగిరికి చెందిన కంచర్లకుంట్ల మోహన్‌రెడ్డి-హైమ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రాజిరెడ్డి(42) భార్య సరితతో కలిసి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతని ఇద్దరు కుమారులు హనుమకొండలో ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్నారు.

రాజిరెడ్డి కొంతకాలంగా మానసిక రుగ్మతతో బాధపడు తూ అప్పుడప్పుడు భార్యతో గొడవ పడేవాడు. ఐదేళ్లగా ఎలాంటి సమస్య లేకుండా ఉన్న రాజిరెడ్డి... పది రోజులు గా నిద్రపోకుండా గొడవ చేస్తూ తనకు శక్తి ఆవహించిందని చెప్పడం మొదలుపెట్టాడు. దీంతో అతనికి భార్య సరిత, తల్లి హైమ తాయత్తు కట్టించారు. గురువారం అర్ధరాత్రి రాజిరెడ్డి మళ్లీ గొడవకు దిగాడు. తెల్లవారాక ఆస్పత్రికి వెళ్దామని పడు కోమని చెప్పగా 'నన్ను ఏం చేస్తున్నారు.. చంపుతారా..' అం టూ తల్లి, భార్యపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దుర్భాషలాడాడు. దీంతో తల్లి హైమ, భార్య సరిత భయంతో ఎదురుగా ఉన్న తమ ఇంట్లోకి వెళ్లి పడుకున్నారు. రాజిరెడ్డి ఊరుకోకుండా బయటికి రాకపోతే ఇంట్లో ఉన్న పత్తి కాలబెడుతా అంటూ హెచ్చరించడంతో తల్లి బయటకు వచ్చింది. ఈ సమయంలో రాజిరెడ్డి పక్కనే ఉన్న రోకలి తీయడంతో తల్లి, భార్య చెరో వైపు పరిగెత్తారు. తొలుత తల్లి హైమ(60)తలపై విచక్షణ రహితంగా దాడి చేయగా, ఆమె తల భాగం మొత్తం ఛిద్ర మై అక్కడికక్కడే మృతి చెందింది. ఇదే సమయంలో పక్కిం ట్లో ఉన్న ఊకంటి జ్యోతి బయటకు వచ్చి అడ్డుకోబోగా ఆమెపై దాడి చేయడంతో తీవ్ర గాయాలతో కింద పడిపోయింది. నిందితుడి భార్య పారిపోయి చుట్టుపక్కల వారిని తీసుకువచ్చేలోగా 'ఇద్దరిని చంపేసిన.. ఎవరు వస్తారో రండి.. అందరి ని చంపుతా..' అని రాజిరెడ్డి ముందుకు రావడంతో అందరూ భ యంతో ఇళ్లల్లోకి వెళ్లిపోయారు. అనంతరం నిందితుడు రోకలితో పారిపోయాడు. గ్రామస్థులు పోలీసులకు స మాచారం అందించడంతో సీఐ వేణుచందర్, ఐదుగురు ఎస్సైలు, పోలీసు సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. గాయపడిన జ్యోతిని అంబులెన్సులో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం ఉదయం వరకు నిందితుడి కోసం గాలించారు.కాగా, గోరికొత్తపల్లి మండలంలోని చిన్నకోడెపాకలో రాజిరెడ్డి అనుమానాస్పదంగా తిరుగుతుండగా గ్రామ స్థులు పట్టుకుని కట్టేసి పోలీసులకు సమాచారం అందించా రు. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందితో చేరుకుని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డీఎస్పీ రాములు ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రత్యక్ష సాక్షులు, కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

» కాపాడబోయి ప్రాణాల మీదకు...

పక్క ఇంట్లో గొడవ జరుగుతందని తెలిసి నిద్రలేచి బయటకు వచ్చి కాపాడబోయిన జ్యోతి(బంధువు) ప్రాణాలకే ప్ర మాదం ఏర్పడింది. రాజిరెడ్డి దాడిలో గాయపడ్డ జ్యోతి కోమాలోకి పోగా హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

గర్భంలోనే శిశువు మృతి

• డ్యూటీ డాక్టర్ అందుబాటులోలేరంటూ ఆరోపణ

• ఈ నెల ఒకటిన శిశువు మృతి..

• ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన

• నచ్చజెప్పిన పోలీసులు

• నర్సంపేట జిల్లా ఆస్పత్రిలో ఘటన



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్‌లో) గర్భంలో నుంచి తీసిన మృతశిశువు

నర్సంపేట టౌన్, జనవరి 5 : వైద్యులు అందుబాటులో లేకపోవడంతో గర్భంలోనే శిశువు మృతి చెందిన ఘటన నర్సంపేట జిల్లా ఆస్పత్రిలో ఈ నెల 1న జరగగా శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత మహిళ భర్త సంగాల శివకృష్ణ కథనం ప్రకారం...

నర్సంపేటలోని వల్లభ్‌నగర్‌కు చెందిన సంగాల మమలత, శివకృష్ణ దంపతులు. శివకృష్ణ ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ భార్యను పోషించుకుంటున్నాడు. ప్రస్తుతం మమలత తొమ్మిది నెలల గర్భిణి(తొలికాన్పు). ఆమెకు రక్తస్రావం అవడంతో గత నెల 30న సాయంత్రం నర్సంపేట జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆస్పత్రిలో గైనకాలజిస్టు, డ్యూటీ డాక్టర్ సునీత లేకపోవడంతో, పీజీ వైద్యురాలు పరీక్షలు నిర్వహించి శిశువు హార్ట్‌బీట్ బాగానే ఉందని చెప్పారు. అయితే శిశువు ఉమ్మనీరు మింగిందని, నార్మల్ డెలివరి చేయాలని భావించగా, నొప్పులు రావడం లేదని వైద్య చికిత్సలందించారు. మరుసటి రోజు(డిసెంబరు 31) సిబ్బంది మమలతను పరీక్షించగా శిశువు గుండె కొట్టుకోవడం లేదని గుర్తించి డ్యూటీ డాక్టర్ సునీతకు సమాచారమిచ్చారు. పరీక్షలు నిర్వహించగా, గర్భసంచిలో లోపాలతో శిశువు మృతి చెందినట్లు గుర్తించి, కుటుంబ సభ్యులకు తెలిపారు. నార్మల్ డెలివరీ అయ్యే అవకాశం లేకపోవడంతో ఈ నెల ఒకటిన సిజేరియన్ చేసి మృత శిశువును బయటకు తీశారు.

• ఆస్పత్రి ఎదుట ఆందోళన

సకాలంలో మమలతను ఆస్పత్రికి తీసుకెళ్లినా.. డ్యూటీ డాక్టర్ అందుబాటులో లేకపోవడంతోనే శిశువు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు, ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. అందుబాటులో లేని డ్యూటీ డాక్టర్‌ను, సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలంటూ నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వారికి నచ్చజెప్పారు. దీంతో వారు ఆందోళన విరమింప చేశారు.

• వైద్యుల నిర్లక్ష్యం లేదు

డాక్టర్ గోపాల్, ఆస్పత్రి సూపరింటెండెంట్

గర్భిణి మమలతకు ఆస్పత్రిలో పీజీ వైద్యురాలు పరీక్షలు నిర్వహించి, చికిత్స అందించారు. వైద్యుల నిర్లక్ష్యం లేదు. గర్భసంచిలో లోపాల వల్లనే శిశువు మృతి చెందినట్లు వైద్యురాలు కేస్ షీట్‌లో పేర్కొంది.

తప్పించుకోవడానికి.. తవ్వేశారు..!

• ల్యాబర్తి ఇసుకాసురుల ప్లాన్



ఆకేరు వాగులో దారికి అడ్డంగా గుంతను తీసిన దృశ్యం

వర్ధన్నపేట రూరల్, జనవరి 5 : అక్రమంగా ఇసుకను తోడుతున్న చోటుకు అధికారులు రాకుండా తప్పించుకోవడానికి ఇసుకాసురులు ఆకేరు వాగుపై ఉన్న రహదారిని తవ్విన సంఘటన మండలంలోని ల్యాబర్తి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక రైతుల కథనం ప్రకారం... గ్రామంలోని ఆకేరు వాగుపై ఉన్న డ్యాం పక్కనే ఇసుక అక్రమ రవాణా చేస్తున్న కొందరు అధికారుల నుంచి తప్పించుకునేందుకు (కందకం) గుంతను తీసినట్లుగా చెపుతున్నారు. డ్యాం ఇంకా ప్రారంభం కాకపోవడంతో వాగులో ఉన్న రహదారి నుండే అటు వైపు వెళ్లి రైతులు వ్యవసాయం చేసుకోవాలి. ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు వెళ్లే దారిని ఇసుకాసురులు ఇలా చేయడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి గుంతను పూడ్చివేయాలని, గుంతను తీసిన వారిపై చర్యలుతీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



కట్ర్యాల శివారులో గుంతను పూడ్చుతున్న పోలీసులు

వర్ధన్నపేట రూరల్, జనవరి 5 : వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని ఉప్పరపెల్లి క్రాస్ నుంచి డీసీ తండా వరకు వరంగల్- ఖమ్మం జాతీయ రహదారిపై ఉన్న గుంతలను కాంక్రీటుతో పూడ్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణించేటపుడు వాహనదారులు కనీస నియమాలు పాటించాలన్నారు. భారీ వాహనాలు అధిక లోడుతో వెళ్లడం వలన రోడ్డు గుంతలమయంగా మారుతోందని తెలిపారు. రాత్రిపూట ప్రయాణించేటప్పుడు వేగం తగ్గించి వెళ్లాలని తెలిపారు. ఎన్‌హెచ్ అధికారులతో మాట్లాడి ఇప్పటికే సూచిక బోర్డులు, ఇతర సహాయ చర్యలు చేపట్టామని, వాహనదారులు సహకరిస్తే ప్రమాదాలు నివారిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సురేష్, ఆశోక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

చెన్నారావుపేట, జనవరి 5 : విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని హెచ్ఎం మండల నోడల్ అధికారి సరళ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులతో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ చేయాలన్నారు. విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంచాలన్నారు. కార్యక్రమంలో ఈర్య మహేందర్, కొమురయ్య, ఇంద్రయ్య ఉమశంకర్, దేవకుమారి, గౌతమి పాల్గొన్నారు.